


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.,L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 06-08-2022 సంపుటి : 03 సంచిక : 306 పేజీలు : 4 వెల : రూ 3-00


## ధరల పెంపును నిరసిస్తూ ఏపీలో కాంగ్రెస్ నిరసనలు




అమరావతి : కేంద్రంలోని మోదీ సర్కార్ పెంచుతున్న ధరలకు వ్యతిరేకంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ ఏపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. కడప జిల్లా వేంపల్లిలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల సామాన్యుడు బ్రతుకలేని పరిస్థితి వచ్చిందని అన్నారు. పెట్రోలు, వంటగ్యాస్, నూనెగింజలు, తదితర నిత్యావసర ధరలను అసాధరణ రీతిలో పెరిగిపోయానని అన్నారు. ఏపీలో పెట్రోల్ ధరలు అధికంగా ఉన్నాయని తెలిపారు. గుంటూరులో కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పీసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలి మాట్లాడుతూ అటు నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఇటు జగన్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేశాయని ఆరోపించారు. ధరలను తగ్గించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెంచుదాం: సీఎం జగన్



తాడేపల్లి: రాష్ట్రంలోని రైతులకు గరిష్ఠ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయంపై సమీక్షా సమావేశం నిర్వహించారాయన. ఈ సందర్భంగా.. రైతులకు ఎరువులు అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత మంత్రిత్వశాఖను, అధికారులను ఆయన ఆదేశించారు. అంతేకాదు ఎక్కడ నుంచి ఎలాంటి సమాచారం వచ్చినా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్బీకేల్లో ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్ నుంచి ప్రతి రోజూ నిరంతరం సమాచారం తెప్పించుకోవాలన్న సీఎం జగన్.. విత్తనాల సరఫరా, ఎరువుల పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తులకు అందుతున్న ధరలు తదితర అంశాలపై పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఈ-క్రాప్ వందశాతం పూర్తిచేయాలని, వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకంతో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన భాగస్వామ్యం కానుందని తెలిపారు. రైతులకు గరిష్ట లబ్ధి చేకూర్చేలా తగిన చర్యలు తీసుకోవాలన్న సీఎం జగన్.. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపైనా ప్రధానంగా చర్చించారు. డ్రోన్ల వినియోగంపై మాస్టర్ ట్రైనర్లను తయారు చేయాలన్న ఆయన.. డ్రోన్ల నిర్వహణ, మరమ్మతుపై శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులతో చెప్పారు. అంతేకాదు.. నియోజకవర్గానికి ఒక ఐటీఐ లేదంటే ఒక పాలిటెక్నిక్ కాలేజీలోని విద్యార్థులకు డ్రోన్ల వినియోగం, నిర్వహణ, మరమ్మతులపై సంపూర్ణ శిక్షణ ఇప్పించాలని సూచించారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ: రాహుల్ గాంధీ ఇవాళ మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య ఖూనీని తిలకిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. శతాబ్దం క్రితమే ఇటుక ఇటుక పేర్చి నిర్మించిన ఇండియాను మన కండ్ల ముందే నాశనం చేస్తున్నారని ఆయన అన్నారు. నియంతృత్వ పోకడకు వ్యతిరేకంగా పోరాటం చేసినవాళ్లను దారుణంగా అటాక్ చేస్తున్నారని, జైలులో వేస్తున్నారని రాహుల్ విమర్శించారు. తాము ప్రజల కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. నిత్యావసర ధరలు పెరుగుతు న్నాయని, నిరుద్యోగం పెరిగిందని, సమాజంలో హింస కూడా అధికమైనట్లు రాహుల్ అన్నారు. కానీ వీటి గురించి మాట్లాడకుండా ప్రభుత్వం విపక్షాలను అణిచివేస్తోందన్నారు. కేవలం నలుగురు లేదా అయిదుగురి ప్రయోజనాల కోసం ప్రభుత్వం నడుస్తోందని, ఇద్దరు ముగ్గురు చేసిన వ్యాపారానికి ప్రభుత్వం అండగా ఉ ంటుందోని ఆరోపించారు. సీడబ్ల్యూసీ సభ్యులు, సీనియర్ నేతలు ఇవాళ ప్రధాని ఇంటిని చుట్టుమట్ట నున్నారు. ఇక లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు చలో రాష్ట్రపతి భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశంలో ప్రతి ప్రభుత్వ సంస్థ ఆర్ఎస్ఎస్ ఆధీనంలోకి వెళ్లిపోయి నట్లు ఆరోపించారు. తమ ప్రభుత్వ సమయంలో మౌళికసదుపాయాలు తటస్థంగా ఉండేవని, కానీ ఇప్పుడు ఒకే పార్టీ తరపున ప్రభుత్వ సంస్థలు ఉన్నట్లు తెలిపారు. స్టార్టప్ ఇండియాతో చాలా మంది రోడ్డున పడ్డారన్నారు.

## ఎంపీల అరెస్టుపై క్లారిటీ ఇచ్చిన రాజ్యసభ చైర్మెన్

న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీలను అరెస్టు చేసే అంశంపై రాజ్యసభ చైర్మెన్ వెంకయ్యనాయుడు ఓ ప్రకటన చేశారు. సభా కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో ఎంపీలను అరెస్టు చేయడం లేదా ప్రశ్నించరాదు అన్న అభిప్రాయాలు కొందరిలో ఉన్నాయని, కానీ ఆ అది సరైన విధానం కాదు అన్నారు. ఎంపీలు కూడా సాధారణ వ్యక్తుల వంటివారే అని అన్నారు. క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో.. ఆ ఎంపీలకు సభ ఎటువంటి రక్షణ కల్పించలేదని వెంకయ్య తెలిపారు. సభకు హాజరుకావాలన్న ఉద్దేశంతో కేసుల విచారణ నుంచి మినహాయింపు ఇవ్వలేమని చైర్మెన్ చెప్పారు. చట్టాన్ని, న్యాయ ప్రక్రియను గౌరవించడం మన విధిగా భావించాలని వెంకయ్య తెలిపారు. కొన్ని రోజుల క్రితం రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌ను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.




## 'ఏపీలో బీజేపీని బాబు జనతా పార్టీగా మార్చేశారు'

### వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైఎస్సార్ జిల్లా: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని బాబు జనతా పార్టీగా మార్చేశారంటూ రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ నేత సత్యకుమార్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సత్యకుమార్ టీడీపీకి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. సత్యకుమార్ కాదు.. అసత్యకుమార్ అని పేరు పెట్టుకోవాలంటూ ఆయన దుయ్యబట్టారు. ఒక పార్టీ సభ్యత్వం తీసుకుని మరో పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో స్కాం జరిగిందన్న బీజేపీ విమర్శలు వాస్తవం కాదా అని శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు. విశాఖ అభివృద్ధి చెందకుండా అడ్డుపడుతున్న దుర్మార్గుడు చంద్రబాబు అంటూ మండిపడ్డారు. ఒక పార్టీ సభ్యత్వం తీసుకుని మరో పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఏలూరులో ఏసీబీ సోదాలు.. టౌన్ ప్లానింగ్ లో రికార్డుల తనిఖీ

**టౌన్ ప్లానింగ్‌లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు**
**రెండు రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తాం**
**ఏసీబీ డీఎస్పీ పీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడి**



ఏలూరు : ఏలూరు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఏలూరులో భవన నిర్మాణాలకు అనుమతులు, అపార్ట్మెంట్లలో అనుమతులకు విరుద్ధంగా పెంట్‌హౌస్‌ల నిర్మాణం, ప్లాన్‌ల అనుమతులకు విరుద్ధంగా భవనాల నిర్మాణాలు సాగుతున్నాయనే ఫిర్యాదులతో ఏసీబీ రంగంలోకి దిగింది. రాష్ట్రవ్యాప్తంగా పలు నగరపాలక సంస్థల కార్యాలయాల్లోని టౌన్‌ప్లానింగ్ విభాగాలను గురువారం ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఏలూరు జిల్లా ఏసీబీ డీఎస్పీ పీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసీబీ సీఐలు ఎన్‌వీ భాస్కరరావు, కె.నాగేంద్రప్రసాద్, సిబ్బంది రికార్డులు తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి గత కొన్నేళ్లుగా ఉన్న రికార్డులన్నీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సాయంత్రం 8.30 గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. శుక్రవారం కూడా సోదాలు ఉంటాయని డీఎస్పీ స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా అవకతవకలు జరిగినట్టు తనిఖీల్లో గుర్తిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని, అవినీతి, అవకతవకలు చోటుచేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సోదాలు చేపట్టామని, ప్రత్యేకమైన కారణాలు ఏమీ లేవని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు.

## రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్బీఐ

ముంబై: రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు పెంచేసింది ఆర్బీఐ. ద్రవ్య పరపతి విధాన నిర్ణయాలను ఇవాళ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడించారు. బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చే వడ్డీలను రెపో రేటుగా పిలుస్తారు. రెపో రేటు పెంచడం అంటే, ఇక కమర్షియల్ బ్యాంకులు, లేదా వ్యక్తులకు రుణాలు తీసుకోవడం భారంగా మారుతుంది. 50 బేసిస్ పాయింట్లు పెంచడంతో.. రెపో రేటు 5.4 శాతానికి చేరినట్లు శక్తికాంత్‌దాస్ వెల్లడించారు. రెపో రేటును పెంచడం వరుసగా ఇది మూడవసారి. అయితే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




## శ్రీశైలంలో ఐదు గేట్లు ఎత్తి నీటి విడుదల



శ్రీశైలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి వరద ఉధృతి గంటగంటకు పెరుగుతూ శ్రీశైల జలాశయానికి చేరుకుంటుంది. శుక్రవారం ఉదయం డ్యాం ఐదు గేట్లను 10 అడుగుల మేర తెరచి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా 1,08,918, విద్యుదోత్పత్తి ద్వారా 36,735, సుంకేశుల నుండి 79,268 క్యూసెక్కులు.. మొత్తం కలిపి 2,24,921 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రం వరకు రిజర్వాయర్‌కు 2,35,874 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదయింది. అదే విధంగా 5 గేట్లను 10 అడుగుల ఎత్తులో తెరచి 1,39,915 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుదోత్పత్తి కేంద్రం ద్వారా 31,299 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదోత్పత్తి కేంద్రం ద్వారా 31,784 క్యూసెక్కులు మొత్తం 2,02,998 క్యూసెక్కుల వరద నీటిని దిగువన ఉన్న సాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేశారు.

## ఏపీలో ఎడ్‌సెట్, లాసెట్ ఫలితాలు విడుదల

అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో ఉన్నత విద్యా మండలి ఇవాళ ఎడ్‌సెట్, లాసెట్ ఫలితాలను విడుదల చేసింది. ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్ర రెడ్డి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎడ్ సెట్లో 96.43 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు. లాసెట్ 3ఏళ్ల కోర్సుకు 90.81శాతం , లాసెట్ 5ఏళ్ల కోర్సుకు 79.51శాతం ఉత్తీర్ణత సాధించగా. రెండేళ్ల పీజీ ఎల్ సెట్?లో 97.24శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. లాసెట్?లో మహిళలకే అత్యధిక ర్యాంకులు వచ్చాయని ఆయన వెల్లడించారు.



# సంపాదకీయం

శనివారం 06-08-2022

## సంపాదన అర్ధ రూపాయి, ఖర్చు రూపాయి'

దేశంలో ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ కుదేలవుతున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని మొదటి మూడు నెలలలో అంటే ఏప్రిల్, మే, జూన్‌లోనే నాలుగు లక్షల కోట్ల నష్టం జరిగింది. అసలే అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చినపుడు రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. సహజంగా నష్టం ఏడు శాతం కన్నా ఎక్కువగా ఉండకూడదు. కానీ, 21 శాతం వరకు రావడం ఆందోళన కలిగిస్తున్నది. గత పదేండ్లలో దేశంలో ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ లేదు. నిజానికి సంపాదన రూ.5,68,000 కోట్లు ఉంటే, ఖర్చు రూ.9,47,000 కోట్లు ఉంది. అందుకే నష్టం జరిగింది. జీతాలు, పెన్షన్‌లకే రూ.7,70,000 కోట్లు ఖర్చు అవుతున్నది. గతంలో ఎన్నడూ ఇంత తేడా సంపాదనలోగానీ, ఖర్చులోగానీ లేదు. 'సంపాదన అర్ధ రూపాయి, ఖర్చు రూపాయి' అన్నట్టుగా తయారైంది పరిస్థితి. విదేశాలలో అమ్ముతున్న ప్రొడక్ట్స్ మన వద్ద అమ్మినపుడు నష్టాలు ఎందుకు? విదేశాలలో లాభాలెందుకు? ఈ అంతు చిక్కని ఆర్థిక నీతిలో ఆంతర్యం ఏమిటో? పాలకులే సమాధానం చెప్పాలి. గవర్నెన్స్ లావిష్‌నెస్, రాజరికం దేశాన్ని మరింత కష్టాలలోకి నెడుతున్నది. విదేశీ పెట్టుబడులు తగ్గుతున్నాయి. పెట్టుబడుల ఉపసంహరణలు పెరుగుతున్నాయి. ఉత్పత్తులు తగ్గి దిగుమతులు పెరిగాయి. ఉపాధి తగ్గినా, పెరగకున్నా ప్రభుత్వ రెవెన్యూలో 80 శాతం జీతాలు, పెన్షన్‌కే పోతున్నాయి. 41 శాతం ప్రజల మీద టాక్స్ భారం పెంచేసారు. కార్పొరేట్‌ల మీద మూడు శాతమే టాక్స్ భారం ఉంది. నాన్ టాక్స్ రెవెన్యూ 70 శాతం తగ్గింది. ఎకానమీని కాపాడలేని పరిస్థితి ఉంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అతి తక్కువగా అంటే, రూ. 30,330 కోట్లు మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చింది. గతంలో రూ.1,75,000 కోట్లు ఇచ్చింది. ఇప్పుడు దారుణంగా తగ్గించి ఇచ్చింది. ఇందుకు కారణం కార్పొరేట్‌ల రుణాలు, ప్రభుత్వం వారికి ఇచ్చిన రాయితీలు, రిటర్న్ ఆఫ్‌లు మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. కోర్ సెక్టర్ అయిన బొగ్గు ఉత్పత్తి గ్రోత్ 31 శాతం పెరిగింది. అయినా అదానీలాంటి కార్పొరేట్‌లకు లాభం చేయడానికి నిర్ణయించుకున్నారు. రూ.3,000 ధర ఉన్న టన్ను బొగ్గును రూ.30,000కు ఆయన నుంచి కొనుగోలు చేయించింది ప్రభుత్వం. తెలంగాణ సీఎం కేసీఆర్ ఇందుకు ఒప్పుకోలేదు. కష్టాలలో కూడా సింగరేణి తన వినియోగదారులకు బొగ్గును ఒప్పందం మేరకు సరఫరా చేయడం అభినందనీయం. ప్రపంచంలో క్రూడ్ ఆయిల్‌కు మంచి గిరాకీ వచ్చిన నేపథ్యంలో దేశంలోని ఇండియన్ ఆయిల్ ఉత్పత్తిని 66 శాతం తగ్గించి వేయడం జరిగింది. గతంలో 541 కోట్ల లాభం పొందిన ఇండియన్ ఆయిల్ ఈసారి ప్రభుత్వ విధానాల వలన రెండు వేల కోట్లు నష్టపోయింది. నేచురల్ గ్యాస్ పరిస్థితి అంతే. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వలన స్టీల్ ఉత్పత్తి పెరిగింది. సిమెంట్ ఉత్పత్తి 19 శాతం పెరిగినప్పటికీ 42 శాతం ప్రాజెక్టుల పనులు ఆగి ఉన్నాయి. కరెంటు ఉత్పత్తి 15 శాతం పెరిగింది. అయితే, ఏక కాలంలో రూ. 60 వేల కోట్ల ఖర్చు పెరిగింది. ఈ ఏడు సంవత్సరాలలో 22 కోట్ల నిరుద్యోగులు తయారయ్యారు. కేంద్రం ఇచ్చిన ఉద్యోగాలు ఏడు లక్షలు మాత్రమే ఉన్నాయి. ఇటీవల పీఎం నరేంద్ర మోదీ ప్రకటించిన పది లక్షల ఉద్యోగాల నియామకం జరగాల్సిన ఉంది. మన దేశం నుంచి రూ.2.5 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులు ఉపసంహరించుకోవడం జరిగింది. శ్రీలంక, మాల్దీవులు, పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్ లాంటి దేశాల ఎకానమీ దెబ్బ తిన్న నేపథ్యాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. 2023-2024 ఎలక్షన్ సంవత్సరాలు కానున్నాయి. ఈ క్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల అప్పులు రూ.70 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కేంద్రం అప్పు 135 లక్షల కోట్ల రూపాయలు దాటింది. 2024 నాటికి ఈ అప్పులు దేశంలో రూ.135 లక్షల కోట్ల నుంచి 155 లక్షల కోట్లకు పెరిగే పరిస్థితి ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. బ్యాంకుల రిటర్న్ ఆఫ్ రూ.10 లక్షల కోట్లు దాటనుంది. అధిక ధరలు, నిరుద్యోగం, అసమానతలు ఇంకా పట్టి పీడిస్తున్నాయి. ఇప్పటికైనా అప్పులను తగ్గించుకుంటూ ఉత్పత్తి రంగంపై దృష్టి సారిస్తే అద్భుతాలు మనం చూడవచ్చు

# గోరంట్లపై వైసీపీ ఆచితూచి అడుగులు...

విజయవాడ, ఆగస్టు 5, ఏదో సినిమాలో లవ్ చేయాలా వద్దా అని ఓ పాట ఉంది. హీరోయిన్ ను ప్రేమించాలా వద్దా అన్న సందిగ్ధంలో హీరో ఆ పాట పాడతాడు. కానీ ఇప్పుడు వైసీపీ కూడా ఒక సందిగ్ధంలో ఉంది. అది సభ్య సమాజం తల దించుకునేలా ప్రవర్తించి అడ్డంగా దొరికిపోయిన దగుల్బాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పై చర్య తీసుకోవాలా వద్దా అన్నదే ఇప్పుడు వైసీపీ సందిగ్ధత. మహిళలో న్యూడ్ గా వీడియో కాల్ మాట్లాడుతూ అడ్డంగా బుక్ అయిన ఎంపీ మాధవ్ ను క్షణం ఆలస్యం చేయకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించాల్సింది పోయి, చర్య తీసుకోవాలా, తీసుకుంటే ఏ చర్య తీసుకోవాలి అంటూ గురువారం సాయంత్రం నుంచి వైసీపీ అధినేత జగన్ మల్ల గుల్లాలు పడుతున్నారు. పార్టీ సీనియర్లతో మాధవ్ పై చర్య తీసుకోవాలా వద్దా, తీసుకుంటే ఎలాంటి చర్య తీసుకోవాలి అని ఎడతెగకుండా చర్చిస్తున్నారు. మహిళతో అసభ్యంగా ప్రవర్తించి దొరికిపోయిన గోరంట్ల మాధవ్ పై చర్య తీసుకునే విషయంలో ఇంతగా తర్జన భర్జన పడుతున్న వైసీపీ అధినేత జగన్.. తనపైనా, తన సర్కార్ పైనా సామాజిక మాధ్యమంలో విమర్శిస్తూ పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేయించే విషయంలో ఒక్క క్షణం కూడా ఆలోచించలేదని పరిశీలకులు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తొలుత సీఎంవో నుంచి గోరంట్ల మాధవ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు లీకులు ఇచ్చారు. మళ్లీ కొద్ది సేపటికే ఆయన చేత రాజీనామా చేయించాలని యోచిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అది కూడా ఖరారు కాలేదు. అసలు చర్య తీసుకోవాలా వద్దా అన్న విషయంపైనే జగన్ పార్టీ ముఖ్య నేతలతో చర్చిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ లోగా ప్రభుత్వ సలహాదారు సజ్జల మీడియా ముందుకు వచ్చి.. గోరంట్లపై చర్య తీసుకోవాలా వద్దా అన్ని నిర్ణయానికి ఇంకా రాలేదనీ, ఆయన ఆ వీడియోలో ఉన్నది తాను కాదని ఖండించారనీ, మార్ఫింగ్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారనీ చెప్పారు. ఒక వేళ ఆ వీడియో మార్ఫింగ్ కాలేదని తేలితే మాధవ్ పై కఠిన చర్యలు తప్పవని మీ?యా ముందు సజ్జల చెప్పారు. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారని తొలుత నేతలు లీకులిచ్చారు. అయితే మాధవ్‌తోనే రాజీనామా చేయించాలని కొందరు నేతలు సూచించారనీ, దాంతో ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదనీ వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. ఎంపీ గోరంట్ల మాధవ్ మహిళతో గోరంట్ల న్యూడ్ గా వీడియో కాల్ లో మాట్లాడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమం ద్వారా వెలుగులోనికి రావడంతో ఆయన పై విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. గతంలో అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్ లు కూడా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి దొరికిపోయిన సంగతి తెలిసిందే. వైసీపీ నేతలకు మహిళల పట్ల గౌరవం లేదనడానికి గతంలో అంబటి, అవంతి శ్రీనివాస్ లు, ఇప్పుడు గోరంట్ల మాధవ్ లే నిదర్శనమని సామాజిక మాధ్యమంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

# గుడివాడ అమర్నాధరెడ్డి నియోజకవర్గం మార్పు



విశాఖపట్టణం, ఆగస్టు 5, మంత్రి గుడివాడ అమర్నాథరెడ్డి నియోజకవర్గం మార్పుపై తీవ్రంగా దృష్టి పెట్టారా? అనకాపల్లి నుంచి మళ్లీ పోటీకి దిగితే విజయం సులువు కాదని భావిస్తున్నారా? గత ఎన్నికలలో తనకు అనుకూలించిన అంశాలేవీ ఇప్పుడు తనకు అనుకూలంగా లేవని భావిస్తున్నారా? మరో వైపు గత ఎన్నికల సమయంలో ఉన్న జగన్ గాలి ఈ సారి ఇసుమంతైనా లేకపోవడం వల్ల అనకాపల్లి నుంచే మళ్లీ పోటీకి దిగితే విజయం దక్కదని భావిస్తున్నారా? పైగా గతంలో తనకు గట్టి మద్దతుగా నిలిచిన దాడి వంటి పలుకు బడి కలిగిన నేతలు ఇప్పుడు తనకు వ్యతిరేకంగా ఉండటం ప్రతికూలంగా మారుతుందని భయపడుతున్నారా? అన్న ప్రశ్నలకు పరిశీలకులు ఔననే బదులిస్తున్నారు. పైగా అధినేత జనంలో ఉన్నవారికే టికెట్లని ఖరాకండీగా చెప్పేసిన తరువాత అనకాపల్లినే పట్టుకు వెళాడితే మొదటికే మోసం వచ్చే అవకాశం ఉందని అమర్నాథ్ రెడ్డి భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఆ కారణంగానే ఆయన గుడివాడ నుంచి పోటీ చేయడానికి సుముఖంగా లేరనీ, తనకు పెందుర్తి నియోజకవర్గమైతే సేఫ్ అని భావిస్తున్నారనీ వైసీపీ శ్రేణుల్లోనే ఒక చర్చ జరుగుతోంది. అనకాపల్లిలో బలమైన సామాజిక వర్గం గుడివాడ అమర్నాథ్ రెడ్డిని గట్టిగా వ్యతిరేకిస్తున్నది. దీనికి తోడు గుడివాడకు అనకాపల్లి నాన్ లోకల్ అన్న ముద్ర ఒకటి ఉంది. దానిని బేస్ చేసుకునే సొంత పార్టీలోనే గుడివాడకు సెగ పెడుతున్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పెందుర్తి నియోజకవర్గం పై దృష్టి పెట్టారని అంటున్నారు. అక్కడ పోటీ చేస్తే తనకు లోకల్ కార్డ్ కలిసొస్తుందని భావిస్తున్నారని పరిశీలకులు అంటున్నారు. ఇక అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా అదీప్ రాజ్ ఉన్నారు. ఇంత వరకూ గుడివాడకు బలమైన మద్దతు దారుగా ఉన్న అదీప్ రాజు.. ఇప్పుడు మంత్రిపై గుర్రుగా ఉన్నారని వైసీపీ శ్రేణులే అంటున్నాయి.

# ముందుకు సాగని ఖరీఫ్



కాకినాడ, ఆగస్టు 5, ఖరీఫ్ కాలంలో రెండ్నెల్లు గడిచినా పంటల సాగులో స్తబ్దత కొనసాగుతూనే ఉంది. ఇటు ఒక మేరకు వర్షాలు అటు ప్రాజెక్టులలో ఆశాజనకంగా నీటి నిల్వలు ఉన్నప్పటికీ సేద్యం సాగట్లేదు. నీటి సౌకర్యం ఉన్న ప్రదేశాల్లో ఈపాటికి జోరుగా వరి నాట్లు, వానల వలన మెట్ట ప్రాంతాల్లో అపరాలు జోరుగా పడాల్సి ఉండగా ఆ పరిస్థితి ఎక్కడా కనిపించట్లేదు. పత్తి మినహా తతిమ్మా అన్ని పంటలూ తక్కువగా సాగైనట్లు ప్రభుత్వ గణాంకాలు తెలుపుతున్నాయి. జులై నెలాఖరు వచ్చినా ఇంకా సాధారణ సాగులో 25 శాతం లోపు సాగు కాని జిల్లాలు ఎనిమిది ఉన్నాయి. విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, ప్రకాశం ఈ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికీ సాధారణ సాగులో 25 శాతం లోపు కూడా సాగు కాని పంటలు జొన్న, రాగి, ఇతర తృణధాన్యాలు, మినుములు, ఉలవలు, మిరప. పొగాకు. మిరప, పొగాకు సాగుకు ఇంకా సమయం ఉందనుకున్నా మిగతావన్నీ మెట్ట పంటలు. ఒక మోస్తరు వానలు పడ్డా వాటిని సాగు చేస్తారు. ఇప్పటికి ఆహారధాన్యాలు 31 శాతం, అన్ని పంటలూ కలుపుకొని 39 శాతం మేర సాగయ్యాయి. భూగర్భ జలాలు బాగున్నప్పటికీ, డెల్టా కాల్వలకు ఎప్పటి కంటే ముందుగానే సాగునీరు విడుదల చేసినప్పటికీ వరి నాట్లు ఊపందుకోలేదు. సాధారణ సాగులో ఇప్పటికి 31 శాతమే నాట్లు పడ్డాయి. ఇప్పటికి కావాల్సిన సాగులో 81 శాతమే వరి సాగైంది. ముందటేడు, నిరుటి కంటే సైతం తక్కువగా నాట్లు పడ్డాయి. వరి ఎక్కువగా సాగయ్యే శ్రీకాకుళంలో 41 శాతం, కాకినాడ 43 శాతం, కోనసీమ 48 శాతం, కృష్ణా 37 శాతం, బాపట్లలో 11 శాతం మేర నాట్లు పడ్డాయి. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరులో 50 శాతానికి మించి నాట్లు పడ్డాయి. నెల్లూరులో 76 శాతం నాట్లు పడ్డప్పటికీ నీటి లభ్యతకు, సాగుకు మధ్య పొంతన కుదరట్లేదు. నెల్లూరులో సాధారణంగా 33 వేల హెక్టార్లలో వరి సాగు కావాల్సి ఉండగా సోమశిలలో నీటి నిల్వలు ఉన్న కారణంగా ముందటేడు 35 వేల హెక్టార్లు, నిరుడు 41 వేల హెక్టార్లలో ఈ పాటికే నాట్లు పడ్డాయి. సోమశిలలో నిరుటి కంటే ఈ మారు రెండు టిఎంసిలు ఎక్కువ నీరున్నప్పటికీ నాట్లు మాత్రం 25 వేల హెక్టార్లలోనే వేశారు. గతంలో కృష్ణా డెల్టా నారుమళ్లకు నీటి సమస్య ఎదురయ్యేది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా బ్యారేజికి నీటిని తోడిపోసి నారుమళ్లను కాపాడేవారు. ఈ ఏట ఆ అవసరం ఇంకా రాలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిరుటి కంటే నీటి నిల్వలు ఎక్కువున్నాయని, పులిచింతలలో సైతం నీరుండటం వలన మున్ముందు కూడా పట్టిసీమ అవసరం పడదని చెబుతున్నారు. విపత్తు నష్టాలు, పంటకు ధరలు గిట్టుబాటు కానందున క్రమేపి రాయలసీమలో వేరుశనగ సాగు నుంచి రైతులు దూరం జరుగుతున్నారు. ఈ ఏట ఆ ధోరణి మరింత పెరిగింది. సాధారణంగా తొలకరి వానలకే విత్తుతారు. రాయలసీమలో వానలు బానే పడ్డప్పటికీ సాగులో పురోగతి లేదు. ఇప్పటికి 45 శాతం విస్తీర్ణంలోనే సాగైంది. అనంతపురం జిల్లాలో 39 శాతం, శ్రీసత్యసాయి 51 శాతం, కర్నూలు 35 శాతం, కడప 40 శాతం, చిత్తూరులో 63 శాతం సాగైంది. జులై దాటితే వేరుశనగకు అదను తప్పుతుంది. ఖరీఫ్‌లో ఒక మేరకు పప్పుధాన్యాలు సాగవుతాయి. వాటిలోనూ కందులు ఎక్కువగా సాగవుతాయి. ఈ మారు 27 శాతమే కందులు సాగయ్యాయి. మొక్కజొన్న మాత్రం కొంత పరవ్వాలేదనిపిస్తోంది. నువ్వులు, పొద్దుతిరుగుడు, సోయాబిన్ ఆశాజనకంగా ఉన్నాయి. వాణిజ్యపంట పత్తి సాగులో వేగం ఉంది. అయితే వర్షాల కారణంగా రెండు మూడు తడవలు విత్తుకోవాల్సి వచ్చింది. ఆ మేరకు రైతులకు పెట్టుబడులు అధికమయ్యాయి.

# అమ్మకానికి స్పైస్ జెట్

ముంబై, ఆగస్టు 5, అప్పుల భారంతో ఉన్న విమానయాన సంస్థ స్పైస్‌జెట్ డబ్బును సేకరించేందుకు వాటాను విక్రయించనుంది. నివేదికల ప్రారం.. స్పైస్‌జెట్ ప్రమోటర్ అజయ్ సింగ్ పార్ట్ సేల్ భారతీయ కంపెనీలు, మిడిల్ ఈస్ట్ కంపెనీలతో చర్చలు నిర్వహిస్తున్నారు. స్పైస్‌జెట్‌లో అజయ్‌సింగ్‌కు 60 శాతం వాటా ఉంది. స్పైస్‌జెట్‌ను 2015లో మారన్ సోదరుల నుండి అజయ్ సింగ్ కొనుగోలు చేశారు. ఆ సమయంలో కూడా విమానయాన సంస్థ మూసివేత అంచున ఉందిస్పైస్ జెట్ కంటే ముందు, జెట్ ఎయిర్‌వేస్, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కూడా నిధుల సమస్యల కారణంగా మూసివేయబడ్డాయి. ఒకదాని తర్వాత ఒకటిగా విమానయాన సంస్థలు మూతపడడం భారత విమానయాన రంగంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎయిర్‌లైన్ కంపెనీలు మొదట భారీగా ప్రారంభం కాగా, ఆపై అప్పుల భారం ఊబిలో కూరుకుపోతున్నాయి. దీంతో తమ సంస్థలను మూసివేస్తున్నాయి.

# అదీప్ రాజుకు ఇంటిపోరు

విశాఖపట్టణం, ఆగస్టు 5, ఆ నియోజకవర్గానికి ఓ సెంటిమెంట్ ఉంది. అక్కడ ఎవరు గెలిచినా వన్‌టైమ్ సెటిల్ మెంట్ తప్ప సెకండ్ చాన్స్ ఉండదని చెబుతారు. ప్రస్తుత ఎమ్మెల్యేకూ ఆ గండం తప్పదనే ప్రచారం జరుగుతోంది. టికెట్ ఆశిస్తున్న సీనియర్ నేత సీన్లోకి రావడంతో ఎమ్మెల్యే ఫ్రస్ట్రేషన్ పీక్స్‌కు వెళ్లినట్టు టాక్. అన్నంరెడ్డి అదీప్ రాజు. విశాఖ జిల్లా పెందుర్తి వైసీపీ ఎమ్మెల్యే. 2019లో ఆయన్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించే వరకు అదీప్ గురించి పెద్దగా ఎవరికీ అవగాహన లేదు. కానీ.. వైసీపీ వేవ్‌లో ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. టీడీపీ సీనియర్ నేత.. మాజీ మంత్రి బండారు సత్యానారాయణ మూర్తిని ఓడించడంతో హైలైట్ అయ్యారు అదీప్ రాజు. చిన్న వయసులో ఎమ్మెల్యే అయినప్పటికీ.. మూడేళ్లుగా నియోజకవర్గంలో తనదైన ముద్ర వేసుకోవడంలో విఫలం అయ్యారనే ప్రచారం జరుగుతోంది. గ్రూపు రాజకీయాల వల్ల పెందుర్తిలోని వైసీపీ సీనియర్లు ఎమ్మెల్యేకు దూరంగా జరిగారు. జనాల్లోకి వెళ్లకపోవడం.. ప్రభుత్వ పథకాలు కొందరికే అందుతున్నాయనే అపవాదుతో అదీప్‌రాజుపై వ్యతిరేకత పెరిగిందని చెబుతున్నారు. రెండున్నరేళ్ల తర్వాత పెందుర్తిలో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టినా.. అది ప్రచారానికే పరిమితమైందనే టాక్ ఉంది. ఎమ్మెల్యే బంధువుల దందాలపై టీడీపీ ప్రశ్నలు.. రాజకీయ సెగలు రేపుతున్నాయి. రాతి చెరువు విషయంలో ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తాడితానం గ్రామాన్ని కాలుష్యం నుంచి 15 రోజుల్లో చర్యలు చేపట్టి బయట పడేస్తామని విశాఖ సభలో సీఎం జగన్ చెప్పినా.. ఆ సమస్య పరిష్కారం దిశగా అదీప్ రాజు చొరవ తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు ఎమ్మెల్యేకు మైనస్ మార్కులు వస్తున్నాయని.. గ్రాఫ్ పడిపోవడంతో వచ్చే ఎన్నికల్లో టికెట్ కష్టమనే ప్రచారం జోరందుకుంది. కాపు ఓటింగ్ ఎక్కువగా వున్న స్థానం కావడంతో ఇక్కడ ప్రత్యామ్నాయం వెతుక్కోవడం అనివార్యమని వైసీపీ ఆలోచన చేసినట్టు భోగట్టా. అంతే మాజీ శాసనసభ్యుడు పంచకర్ల రమేష్ బాబు సీన్లోకి వచ్చారు. 2009లో ప్రజారాజ్యం తరపున పెందుర్తి నుంచి? 2014లో యలమంచిలి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన పంచకర్ల.. ఇటీవల సీఎం జగన్‌ను కలిసి వచ్చారు. ఆ తర్వాత పెందుర్తిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు కూడా. అయితే పంచకర్ల హడావిడిపై ఎమ్మెల్యే అదీప్ రాజుకు చిర్రెత్తికొస్తోందట. అది కాస్తా బయట పెట్టేసుకున్నారు. పంచకర్లపై సెటైర్లు పేల్చారు. పంచకర్లను తాము వైసీపీ నేతగా పరిగణించడం లేదని.. తాము జగన్ సైనికులమైతే.. ఆయన జనసైనికుడని కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. ఎమ్మెల్యేపై వైపీసీ పెద్దలు సీరియస్ అయ్యారట. ఉమ్మడి జిల్లాల వైసీపీ సమన్వయ కర్తగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారట పంచకర్ల. దాంతో అదీప్ రాజును సుబ్బారెడ్డి గట్టిగా మందలించినట్టు ప్రచారం జరుగుతోంది. అదీప్ రాజు అభ్యర్థి అయితే వచ్చే ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమని టీడీపీ నేతలు లెక్క లేస్తున్నారట. దాంతో వైసీపీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయని సమాచారం. మొత్తానికి పెందుర్తి ఎపిసోడ్‌లో మొగుడు కొట్టినందుకు కాదు.. తోటికోడలు నవ్వినందుకు ఎక్కువ బాధపడినట్టుగా ఉందని ఎమ్మెల్యేను ఉద్దేశించి పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు వైసీపీ నేతలు.

# నాదెండ్ల మనోహర్ ను దూరం పెడుతున్నారా...



గుంటూరు, ఆగస్టు 5, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ను కొంత దూరం పెట్టినట్లే కనపడుతుంది. ఆయనతో రానున్న కాలంలో కొంత ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన పవన్ కల్యాణ్ ఆయనకు తన పర్యటనల బాధ్యతలను మాత్రమే అప్పగించినట్లు సమాచారం. ముఖ్యమైన నిర్ణయాలలో నాదెండ్ల జోక్యం లేకుండా ఉండేలా పవన్ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం నాదెండ్ల మనోహర్ జనసేనలో చేరిన నాటి నుంచి క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనకు రాజకీయ వ్యవహారా కమిటీ ఛైర్మన్ పదవిని పవన్ అప్పగించారు. అయితే నాదెండ్ల తీరుతో అనేక మంది తనకు తొలి నుంచి అండగా ఉన్న వారు పార్టీ నుంచి వెళ్లిపోవడాన్ని పవన్ గమనించారు. తనతో ఎవరినీ కలవనివ్వకపోవడం, ముఖ్యమైన విషయాలపై చర్చించకుండా అడ్డుకోవడం వంటి వాటిపై నాదెండ్లపై పవన్ కు ఫిర్యాదులు అందాయని తెలుస్తోంది. పోయినోళ్లంతా.... గతంలో అనేక మంది పార్టీని వీడారు. జేడీ లక్ష్మీనారాయణ దగ్గర నుంచి మొన్నటి మాదాసు గంగాధరం వరకూ పార్టీ వీడటానికి కారణం నాదెండ్ల మనోహర్ కారణమని పవన్ కు ఫిర్యాదులు అందాయి. ముఖ్యమైన, పార్టీకి తొలి నుంచి అండగా నిలిచిన నేతలు కూడా నాదెండ్ల వైఖరితో ఇబ్బంది పడుతున్నారన్న ఆరోపణలు జనసేనాని దృష్టికి వచ్చాయంటున్నారు. అంతేకాకుండా నాదెండ్ల జిల్లాల పర్యటనల్లో కూడా అక్కడి నేతలు గ్రూపులుగా మారుతుండటాన్ని పవన్ గమనించారంటున్నారు. చేరికలు కూడా.... దీంతో పాటు జనసేనలో చేరికలు లే?కపోవడానికి కూడా నాదెండ్ల మనోహర్ కారణమని భావించిన పవన్ కల్యాణ్ ఆయనను దూరంగా పెట్టాలని నిర్ణయించారని తెలిసింది. తన పర్యటనల బాగోగులను చూడటం వరకే నాదెండ్లను పరిమితం చేయాలని ఆయన భావిస్తున్నారట. సామాజికవర్గం దృష్ట్యా పైకి నాదెండ్లకు పబ్లిక్ సమావేశాల్లో ప్రాధాన్యత ఉన్నట్లు కన్పించినా గతంలో మాదిరిగా ఆయనకు ముఖ్య నిర్ణయాల్లో మాత్రం ప్రయారిటీ ఉండే అవకాశం లేదన్నది జనసేన వర్గాల నుంచి విన్పిస్తున్న టాక్.

# అదుపు తప్పిన లారీ..ఇద్దరు మహిళల దుర్మరణం

అనంతపురం అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం, కాలువ పల్లి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. వంతెన మీద నిల్చున్న మహిళలపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో మహిళల మృతదేహాలు మాంసపు ముద్దల్లా మారాయి. పేరూరు డ్యామ్ నుంచి నీటిని దిగువకు వదలడంతో చూసేందుకు మహిళలు వచ్చారు. ఈ ప్రమాదంలో సరస్వతి, లక్ష్మీదేవి అనే మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. అయితే ప్రమాదం జరిగిన తర్వాత లారీ ఆగకుండా వెళ్లిపోవడంతో గ్రామస్తులు వెంబడించి కాల్వపల్లి సమీపంలో పట్టుకుని, పోలీసులకు సమాచారం అందించారు.

# పొలంబడి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

ఆచంట హార్ ఘర్ తీరంగ్ కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం శేషామ్మ చెరువు పొలంబడి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పాల్గొన్నారు. కలెక్టర్ కు మర్యాదపూర్వకంగా గ్రామ సర్పంచ్ రైతులు ఘన స్వాగతం పలికారు. తరువాత కలెక్టర్ చర్చ గోష్టి కార్యక్రమంలో క్రింద కూర్చుని రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. రైతులు మాట్లాడుతూ కాలువల పూడికతీత, గుర్రపు డెక్క, రబీ పంటకు అమ్మిన ధాన్యం డబ్బులు జమ కాలేదని సమస్యలు తెలియజేశారు.. దీంతో కలెక్టర్ స్సానుకూలంగా స్పందిస్తూ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు..వ్యవసా యంలో ఎన్నో మార్పులు వచ్చాయి.

# అమ్మకానికి విశాఖ పోర్టు



విశాఖపట్టణం, ఆగస్టు 5, ప్రతిష్ఠాత్మకమైన వైజాగ్ పోర్టు ట్రస్ట్ (విపిటి) క్రమంగా ప్రైవేటు పరమవుతోంది. పిపిపి విధానంలో దేశంలోని 13 మేజర్ పోర్టులను కేంద్రం ప్రైవేటు పరం చేస్తోంది. అందులో భాగంగా విశాఖ పోర్టును ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం శరవేగంగా ముందుకు కదులుతోంది. విశాఖ పోర్టు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.రామ్మోహనరావు తీరు చూస్తే అది అర్థమవుతోంది. ఈయన చైర్మన్‌గా రాక ముందు ఆరు బెర్తులు పిపిపిలోకి వెళ్లిపోయాయి. ఈయన వచ్చాక మూడు, తాజాగా మరో రెండు పిపిపిలోకి వెళ్లిపోతున్నాయన్న చర్చ పోర్టు వర్గాల నుంచి వినిపిస్తోంది. పిపిపిలో వైజాగ్ పోర్టులోని ఎస్సార్‌కు 1, వేదాంత 1, ఎవిఆర్ 1, విసిటిపిఎల్ 2, విఎస్‌పిఎల్ 1 పిపిపిలోకి తొలి దశలో వెళ్లిపోయాయి. ఒక్కో బెర్తులో 120 నుంచి 150 మంది కాంట్రాక్టు కార్మికులను నియమించుకున్నారు. రెండో దశ పిపిపిలో భాగంగా డబ్ల్యూ క్యూ 7, 8, ఈక్యూ 7, డబ్ల్యూ క్యూ 6 బెర్తులు పిపిపిలోకి వెళ్లిపోయాయి. అయితే ఈ బెర్తులకు ఇంకా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి సెక్యూరిటీ క్లియరెన్స్ రావాల్సి ఉంది. నేడో రేపో వస్తుందని పోర్టు ఉన్నతాధికార వర్గాల సమాచారం. ఈ మూడూ కాకుండా తాజాగా మరో రెండు ప్రాజెక్టులను పిపిపిలో పెట్టేశారు. వీటిలో ప్రతిష్ఠాత్మకమైన పోర్టు ఆసుపత్రి ఉండడం విశేషం. ఆరు ఎకరాల స్థలం, పోర్టు ఆసుపత్రి సహా పిపిపి ప్రాజెక్టులోకి వెళ్లిపోనున్నాయి. ఈ బెర్తుల్లో కేవలం పర్యవేక్షణ సెక్షన్ అధికారులు మాత్రమే ఉంటారు. 25 పోర్టు బెర్తుల్లో సుమారు 11 పిపిపిలోకి వెళ్లిపోవడంతో గడచిన 15ఏళ్లుగా పర్మినెంట్ ఉద్యోగ ప్రక్రియ నిలిచిపోయింది. 15వేల వరకూ ఉండే పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య నేడు మూడు వేలకు పడిపోయింది. పోర్టు ఆసుపత్రి స్థానంలో సుమారు రూ. 200 కోట్లతో మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి పిపిపి పద్ధతిలో నిర్మించనున్నట్లు పోర్టు యాజమాన్యం చెబుతోంది. తాజాగా పోర్టు యాజమాన్యం పిపిపి 2వ దశలో 3 బెర్తులకు టెండర్లు పిలవగా మూడు టెండర్లు వచ్చాయి. వీటికి కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రావాల్సి ఉంది. పోర్టులో బెర్తు తీసుకుని కార్గో చేయకుండా పోర్టుకు ఆర్థికంగా నష్టం చేకూర్చిన అదానీని పిపిపి 2వ దశ టెండర్లలో పాల్గొనకుండా అనర్హత వేటు వేసింది. దీంతో అదానీ కోర్టులో ఛాలెంజ్ చేయగా పోర్టుకు చెందిన కొంతమంది అధికారులు తాజాగా వాదనలు వినిపించేందుకు హైదరాబాద్, ఢిల్లీకి సిద్ధమయ్యారు. 3వ దశ పిపిపిలో ఈక్యూ -6 బెర్తుకు అలాగే పోర్టు ఆసుపత్రికీ టెండర్లను పిలిచేందుకు రంగం సిద్ధమవుతోంది.

# మండపేట ఎంపీపీపై 420 కేసు..

**ఫోర్జరీ సంతకాలతో మైనింగ్ అనుమతులు..**
**పోలీసులకు స్థల యజమాని ఫిర్యాదు..**
**వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుని పైనా 420 కేసు నమోదు**

మండపేట కోనసీమ ఎపి బాధ్యతా యుతమైన పదవిలో ఉన్న మండపేట ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ చీటింగ్ చేసిన వ్యవహారం మండపేట నియోజక వర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో అధికార పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తన ఎంపీపీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ మండలంలోని ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన నాయకుడే ఇటువంటి మోసాలకు పాల్పడం పట్ల ప్రజల్లో చులకన భావం వ్యక్తమవుతోంది. పదవిలోకి రాకముందే అక్రమ మైనింగ్ లో ఆరితేరి కోట్లకు పడగలెత్తిన ఈ ఉండమట్ల బ్రదర్స్ అధికారంలోకి వచ్చాక మరింత రెచ్చిపోతున్నారు. చివరకు సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ అగ్రిమెంట్లు సృష్టిస్తున్న తీరుపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ చీటింగ్ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన న్యాయ వాది గంధం గంగాధర్ కు కేశవరం గ్రామంలో భూమి ఉంది. స్థలం లెవెల్ చేసి గ్రావెల్ తీసుకెళ్లేందుకు గంగాధర్ తో కేశవరం గ్రామ వైఎస్సార్సీపీ అధ్యక్షుడు ఉండమట్ల తాతాజీ, ఎంపీపీ శ్రీనివాస్ వారి బంధువు యర్రంశెట్టి శ్రీనివాస్ లు పై గతంలో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పటికే గడువు ముగిసి పోయింది. అయినప్పటికీ సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ఒప్పంద పత్రాలు సృష్టించారు. ఆపై తమకున్న అధికారాన్ని అడ్డు పెట్టుకొని రెవెన్యూ అధికారుల నుండి మైనింగ్ కు అనుమతులు తెచ్చుకుని తవ్వకాలు మొదలు పెట్టారు. తమ స్థలంలో అక్రమంగా తవ్వకాలు జరపడంపై లాయర్ గంగాధర్ ఆరా తీయగా సంతకాలు ఫోర్జరీ వెలుగు చూసింది. దీనిపై లాయర్ గంగాధర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నేతలు కావడంతో మొదట్లో పోలీసులు కేసు నమోదుకు వెనకడుగు వేసినట్టు తెలుస్తోంది. అయితే న్యాయవాది తన బార్ అసోసియేషన్ ద్వారా ఒత్తిడి తీసుకు రావడంతో తప్పనిసరి పరిస్థితిలో కేసు నమోదు చేసినట్టు సమాచారం. ఏ1గా ఉండమట్ల తాతాజీ, ఏ2గా ఎంపీపీ శ్రీనివాస్, ఏ3గా యర్రంశెట్టి సత్తిబాబులపై 420, 468, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసులు పెట్టి మూడు వారాలు అవుతున్నా అరెస్టులు చేయకుండా పోలీసులు జాప్యం చేయడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

## కాంగ్రెస్ నేతల ధర్నా..అరెస్టు

విజయవాడ విజయవాడ ఆంధ్ర రత్న భవన్ వద్ద శుక్రవారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ఘెరావ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ తో పాటు ఏఐసీసీ కార్యదర్శి గిడుగు రుద్రరాజు, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు జంగా గౌతమ్, విజయవాడ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరి శెట్టి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు. పోలీసులు వారిని అరెస్టు చేసి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అంతకుముందు శైలజానాథ్ మాట్లాడుతూ ధరలు పెరుగుదల పన్నుల భారాలతో పేదవాడు బ్రతకలేక పోతున్నాడు. మోదీ, జగన్ నాయకత్వంలో ప్రజలపై దోపిడీ పెరిగి పోయింది. పేదలు బ్రకలేని పరిస్థితినీ ప్రధాని మోడీ తెచ్చారు. ప్రధాని మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయానికి సీఎం జగన్ మద్దతుగా ఉన్నారు . జీయస్టి వేసి ప్రజల నడ్డి విరుస్తున్నారు. మజ్జిగ, లస్సీ, ప్యాకెట్ లపై కూడా జియస్టీ దారుణమని అన్నారు. రెండు ప్రభుత్వాలు కలిసి ప్రజలను దోచుకుంటున్నారు. మోడీ, జగన్ లకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. ప్రజా స్వామ్య బద్దంగా నితసన తెలిపినా అరెస్టు చేయిస్తున్నారని అయన మండిపడ్డారు.

## ముదినేపల్లిలో పర్యటించిన ఏలూరు జిల్లా ఎస్పీ

ఏలూరు ఏలూరు జిల్లా కైకలూరు నియోజక వర్గం ముదినేపల్లి లో జిల్లా ఎస్. పి రాహుల్ దేవ్ శర్మ పర్యటించారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్ కి వచ్చి పోలీస్ లకు ప్రజల రక్షణ నిమిత్తం తీసుకొంటున్న చర్యలు తెలుసుకు న్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పైన, హెల్మట్ పెట్టుకొకుండా టూ వీలర్స్ డ్రైవింగ్, ప్రతి షాపులో కూడా దొంగతనాలను నియంత్రణ కోసం , మరియు మాదకద్రవ్యల నియంత్రణ అవగాహనను గురించి తెలుసుకొని వాహనదా రులకు అవగాహనా చర్యలు తీసుకోవాలని ఎస్.ఐ, సిబ్బంది కి ఆదేశించారు. దిశా యాపు గురించి ప్రతి ఒక్కరికి అవగాహనా కల్పించాలని , ప్రతి క్షణం అందుబాటులోవుంది ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు.

# తూర్పుపాలెంలో మాజీ మంత్రి పర్యటన

పెనుమంట్ర ప్రతీ పేదవానికి సొంతింటి కల నెరవే ర్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్ రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీని నిరంతరంగా కొన సాగిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పోడూరు మండలం తూర్పుపాలెంలోని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కార్యాలయంలో ఆచంట వేమవరం గ్రామానికి చెందిన లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, పోడూరు , పెనుమంట్ర,ఆచంట మండలాలకు చెందిన లబ్దిదారులకు రూ. 11 లక్షల విలువైన సీఎం రిలీఫ్ చెక్కులను మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పంపిణీ చేశారు. పెనుగొండ మండలం తామరాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం. కార్యక్రమం నిర్వహించారు. తామరాడ లో బీసీ కమ్యూనిటీ హాలు పై అంతస్తు భవన నిర్మానానికి నిధులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రం భవన సమస్యను సత్వరం పరిష్కరిస్తామన్నారు. విడతల వారీగా డ్రెయినేజీ, రహదారుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఇచ్చిన ప్రతీ హామీని నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని తెలిపారు. సంక్షేమం అమలులో పార్టీ, వర్గ, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతీ ఒక్కరీ అందేలా చేసిన ఘనత సీఎం జగన్ కు దక్కుతుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు అర్హత ఉంటే చాలు వాలంటీర్లు ఇంటి ముంగి టకు వచ్చి పథకాన్ని అందిస్తున్నారన్నారు. పేదల, సంక్షేమం కోసం సీఎం జగన్ ఆహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బొక్కా అరుణ, జక్కంశెట్టి చంటి, పోతుమూడి రామ చంద్రరావు,వైట్ల కిషోర్ , కోట వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు..

## వైకాపావి శవ రాజకీయాలు

విశాఖపట్నం డైవర్షన్ పొలిటిక్స్ కోసమే.. వైసీపీ శవ రాజకీయాలను చేస్తోందని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనిత అన్నారు. ఏ1,ఏ2 16 నెలలు పాటు జైల్ లో ఉన్నారని, తండ్రి శవం ఉండగానే సీఎం కుర్చీలో కూర్చోవా లని అనుకున్నారని ఎన్టీఆర్ కూతురు ఆత్మహత్యచేసుకుంటే..మానవత్వం లేకుండా మాట్లాడడం దారుణమని చెప్పారు. వైసిపి నేతలు సోషల్ మీడియాలో అవాకులు, చెవాకులు పేలుతున్నారని,రోజు రోజుకి జగన్ గ్రాఫ్ పడిపోతుం దనే భయంతోనే ఎన్టీఆర్ కుటుంబంపై వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీ మాధవ్ వ్యవహా రంపై విజయ సాయిరెడ్డి ట్వీట్ పెట్టే దమ్ము ఉందా అని నిలదీశారు. ఎంపీ మాధవ్ వ్యవహారాన్ని మహిళా కమిషన్,లోక సభ స్పీకర్ కూడా ఈ కేసును సుమోటోగా తీసుకోవాలి డిమాండ్ చేశారు.

# కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా కాంగ్రెస్ ధర్నా

**తక్షణమే జి.యస్.టి ని రద్దు చేయాలి**
**బస్టాండ్ సెంటర్ నుండి ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ**
**కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన టి.పి.సి.సి సభ్యులు ఎడవల్లి**

భద్రాద్రి కొత్తగూడెం, ఏఐసీసీ, పీసీసీ ఆదేశానుసారం పెంచిన నిత్యావసర సరుకుల ధరలు మరియు జి.యస్.టి ని పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగాటీపీసీసీ సభ్యులు ఎడవల్లి కృష్ణ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం దగ్గర నుండి భారీ ర్యాలీ తో ధర్నా చౌక్ చేరుకొని ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నరేంద్రమోదీ నేతృత్వంలో వారి ఇష్టానుసారంగా నిత్యావసర సరుకులపై ధరలు పెంచుకుంటూ పోతూ సామాన్య ప్రజల నడ్డి విరిస్తుందని,సామాన్య మధ్యతరగతి ప్రజలు కాయ కష్టం చేసుకుంటే కానీ పుట గడవని పరిస్థితులలో ధరలు పెంచుకుంటు పోతే ప్రజలు ఎలా బ్రతుకుతారన్నారు. కొత్తగా జి.యస్.టి తో ఆఖరికి చనిపోయిన శవనికి కూడా జి.యస్.టి అంటే ఇది స్వాతంత్ర్య భారతదేశం లా కాకుండా పూర్వం రాజులు శాసనం మాదిరిగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో,రాష్టంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజల యోగక్షేమాలు దృష్టిలో పెట్టుకొని సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉందన్నారు. చేసింది,ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని, అనేక పోరాటాలు చేసిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకి దక్కింది,రాబోవు రోజుల్లో కేంద్రంలో,రాష్టంలో అఖండ మెజారిటి తో కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యం అని అన్నారు. ప్రజల ను ఏడిపించిన ఏ ప్రభుత్వం నిలవలేదు,తక్షణం జి.యస్.టి రద్దుచేసి,నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని , లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు, ఉద్యమాలు,రాస్తా రోకోలు ,ధర్నాలు ముమ్మరం చేస్తామని కాంగ్రెస్ అంటే ప్రజల పార్టీ అని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యలయం వరకు భారీ ర్యాలీ గా వెళ్లి కలెక్టర్ అనుదీప్ కి మెమొరడం అందజేశారు. కార్యక్రమములో:సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల శాంతయ్య, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగరావు,చుంచుపల్లి మండల అధ్యక్షులు అంథొటి పాల్, లక్మిదేవిపల్లి మండల అధ్యక్షులు సకినాల వెంకటేశ్వరావు,బీసీ సెల్ పట్టణ నాయకులు పల్లపు వెంకటేశ్వర్లు,జిల్లా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ శంకర్ నాయక్,లక్కినేని సాయి,కోటేష్ నాయక్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుబ్బారెడ్డి,బద్దీ కిషోర్,ఐ ఎన్ టి యు సి జనరల్ సెక్రెటరీ త్యాగరాజన్,ఉపాధ్యక్షులు కాలం నాగభూషణం,పాల్వంచ మైనార్టీ టౌన్ అధ్యక్షులు చంద్ పాషా,కొత్తగూడెం మైనార్టీ మహిళ అధ్యక్షురాలు జారిన,టౌన్ అధ్యక్షురాలు వాలి,కొత్తగూడెం పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షులు కల్లెపల్లి రాజు,లక్మిదేవిపల్లి మండల ఎస్సి సెల్ అధ్యక్షులు కొప్పుల రమేష్,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పునేమ్ అనుదీప్,పాల్వంచ బీసీ సెల్ పట్టణ నాయకులు లోగాని మురళి,కాంగ్రెస్ నాయకులు సునీల్,కొలిపాక సత్యనారాయణ,వనపాకుల రాంబాబు,చెందర్,శంకర్,సైమాన్, రాంనాయక్,చ ారి,గడ్డిగుట్ట నరేష్,గణేష్,కోడి,శనగ లక్ష్మణ్,దేవిలాల్,చంద్రకళ,పెద్దమల్లు నాగేశ్వరరావు, గురజాల సీతయ్య, పైజుద్దీన్,అక్బర్,కుమార్,మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ,అభిమానులు పాల్గొన్నారు.

## వివాదంలోకి లాగొద్దు

అనకాపల్లి తమను అనవసరంగా వివాదంలోకి రావద్దని చింతకాయల విజయ్ అన్నారు. ఒక ఎంపీ ఇలా వ్యవహరించడం సిగ్గు చేటని ఆయన అన్నారు. మాధవ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని విజయ్ డిమాండ్ చేశారు. ఎంపీగా ప్రజలు గెలిపించింది ఇలాంటి పనులు చేయడం కోసమేనా అని చింతకాయల విజయ్ నిలదీశారు. తమ పేర్లను అనవసరంగా వివాదంలోకి లాగుతున్నారని ఆయన తెలిపారు. తమకు ఆ వీడియోతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తన పేరు ప్రస్తావించినందున తాను గోరంట్ల మాధవ్ పై పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ఒక ఎంపీ ఇలా సిగ్గుపడే విధంగా వ్యవహరించడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో కాకుండా ఇంకా జిమ్ వీడియో అంటూ బుకాయిస్తున్నారని చింతకాయల విజయ్ అన్నారు. వీడియో ఫేక్ అనేదా కాదా అన్నది తేలాలంటే ముఖ్యమంత్రి జగన్ దీనిపై విచారణ చేయించాలని కోరారు. ప్రభుత్వం వారి చేతిలో ఉందని కాబట్టి వారే దీనిపై విచారణ చేయించుకోవాలని చింతకాయల విజయ్ అన్నారు.

## మత్స్యకారుల సమస్యకు ఫుల్ స్టాప్

విశాఖపట్నం విశాఖ మత్స్యకారుల మధ్య నలుగుతున్న రింగ్ వలల వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. తీరప్రాంతాల్లో ఉన్న14మత్స్యకార గ్రామల మత్స్యకార సంఘా ల పెద్దలతో జరిగిన సమావేశానికి మంత్రి అప్పలరాజు,జిల్లా అధికారులు పాల్గో న్నారు. ఈ సమావేశంలో మత్స్యకారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు మంత్రి అప్పలరాజు తెలిపారు. కొత్త రింగ్ నెట్లకు అవకాశం ఇవ్వకుండా,ఎవ్వరికీ ఇబ్బందులు లేకుండా హద్దులు నిర్ణయించుకోవడం జరిగిందని,భవిష్యత్ లో ఎమైన సమస్యలు వస్తే సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. రేపటి నుంచి మత్స్యవేటకు అనుమతి ఇస్తున్నట్లు మంత్రి అప్పలరాజు ప్రకటించారు.

## శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకాలు

**కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**బంగారు చీరతో అమ్మవారు భక్తులకు దర్శనం**

విశాఖపట్నం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ఆరాధ్య దైవం.. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం(వరలక్ష్మీ వ్రతం) సందర్భంగా విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంని పురస్కరించుకుని తెల్లవారుజామునే అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ఆరాధన గావించారు.. అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పించారు.. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు..ఆలయ ఈవో శిరీష ఆధ్వర్యంలోఏఇఓ రాంబాబు భక్తులకు విశేష ఏర్పాట్లు చేశారుబంగారు చీరలో కన్యకా పరమేశ్వరి దర్శనంవరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని పాతనగరం లో కొలువై ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని బంగారు చీరతో అందంగా అలంకరించారు.. పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.. బంగారు చీరలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పరవశం చెందారు

# టిడ్కో ఇళ్ల పంపిణీ సభలో ఉద్రిక్తత

పాలకొల్లు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పంపిణీ సభ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ముందుగా మంత్రులు ఆదిమూలపు సురేష్, కొట్టు సత్యనారాయణ, కారుమూరి, దాడిశెట్టి రాజా ప్రసంగించారు. ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అంగరకు మంత్రులు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. తన నియోజకవర్గ సభలో తనను మాట్లాడనివ్వరా అంటూ ఎమ్మెల్యే నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేసారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వమని, మైక్ ఇవ్వాలంటూ సబ్ కలెక్టర్ ను అయన డిమాండ్ చేసారు. ఎమ్మెల్యేను పట్టించుకోకుండా మంత్రులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేస్తుండడంతో ఉద్రిక్తత నెలకొంది. తనకు మైకు ఇచ్చి మాట్లాడించే వరకు కదిలేది లేదంటూ ఎమ్మెల్యే నిమ్మల అందోళనకు దిగారు.

## అధికారం కోసం బిజెపీ అడ్డదారులు

హైదరాబాద్ తెలంగాణలో అధికారం కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తమ కుటుంబసభ్యుడని, వెంకట్ రెడ్డి వేరు, రాజగోపాల్ రెడ్డి వేరంటూ ఆయన అన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కాంగ్రెస్ ద్రోహిగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రాజగోపాల్ రెడ్డికి బ్రాండ్ ఇచ్చిందే కాంగ్రెస్ అన్నారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురించి తాను ప్రస్తావన చేయలేదని స్పష్టం చేశారు. ఆయనకు, తనకు మధ్య కావాలనే విబేధాలు సృష్టిస్తున్నారన్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు

## ఏయూలో 300 అడుగుల జాతీయ జెండా

విశాఖపట్నం విశాఖ ఏయూలో 300 అడుగుల మువన్నెల జెండా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. దేశ సార్వభౌమత్వం,జాతి సమైఖ్యత,పౌరుల్లో సమైఖ్యతను చాటి చెప్పే వారిలో దేశ భక్తిని పెంపొందించడమే లక్షంగా ఏయూ అధికారులు భారీ జాతీయ పతాన్ని ప్రదర్శించి మన దేశ ఔన్నత్యం, సంస్కృతిని చాటి చెప్పారు. స్వాతంత్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అజాదికా అమృత్ పేరిట జరుగుతున్న విభిన్న కార్యక్రమాల్లో బాగంగా విశాఖ ఏయూలో జాతీయ పతాన్ని ప్రదర్శ నిర్వహించినట్లు ఏయూ అధికారులు తెలిపారు. యువతలో దేశభక్తి ,స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించే దిశగా 300 అడుగుల జాతీయ పతాకం ప్రదర్శన జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిస్ సౌత్ ఇండియాగా ఎంపికైన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ విభాగం విద్యార్థిని ఛరిష్మా కృష్ణ పాల్గొని ఆకట్టుకున్నారు.

## గ్రామాల్లో కొలువైన పీర్ల దేవుళ్ళుభక్తిశ్రద్ధలతో ఇమామ్ ఖాసీం (గంటప్ప దేవుళ్ళు)

నేడు సరగసుకులమతాలకు అతీతంగా అతిపెద్ద పండుగ మొహారం కౌతాళం కౌతాళం మండలంలో గ్రామ గ్రామంలో కొలువైన పీర్లదేవుళ్ళు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవుళ్ళు పీర్లదేవుళ్ళు గ్రామ ప్రజలందరు 10 రోజులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ముస్లిం లు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ మొహారం ఒకటి పది రోజులు పాటు జరిపే ఈ పండుగ సందర్భంగా ఇస్లాం కు సంబంధించిన ప్రవచనములు మొహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తాయి మొహారం నెల పదోరోజున పీర్లను ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హజ్రత్ ఇమాం హుషేన్ ను గుర్తుగ పంజా ( ప్రతిమ) లను ఊరేగించి తమసంతాపం ప్రకటిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలి మాసాన్ని మొహారం నెలగా భావిస్తారు. మొహారం పండుగ పదో రోజున ప్రత్యేకత ఉంది 10,11 వ రోజుల్లో ఉపవాస దీక్షలు పాటించడాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. మొహారం నెలలో ముస్లింలు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించారు. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుషేన్ కు సంతాపం తెలిపే ఉద్దేశ్యం తో ముస్లింలు పాటిస్తారు. మానవ హక్కులకోసంజరిగిన చరిత్రాత్మక పోరాటం మొహారం ఈ పేరు వినగానే పిర్లు, నిప్పుల గుండాలు గుండెలు బాదుకుంటు మతం చదవటాలు గుర్తుకువస్తాయి. మంగళవారం ఇమామ్ ఖాసీం సరగసు భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు జరుపుకున్నారు. ఉదయం పీర్లదేవుళ్ళు ఊరేగింపుగ వెళ్లారు. ఊరేగింపు లోప్రజాలు నైవేద్యాలు సమర్పించారు.

## అమ్మవారిశాలలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

**ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి మాత**
**వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న 164 మంది వెండి రథం ఉభయదాతలు**

బద్వేలు బద్వేలులో శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య వర్తకసంఘం ఆర్యవైశ్య మహిళామండలి వారి ఆధ్వర్యంలో వెండి రథంకు సహకరించిన 264, మంది శాశ్వత ఉభయదాతలకు అంగరంగ వైభవంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వరలక్ష్మీ వ్రతం కార్యక్రమాన్ని శు క్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వరలక్ష్మివ్రతంలో పలువురు మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉ భయదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి సుబ్బారావు మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మితో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు

## పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

**ప్రభలుతున్న విష జ్వరాలు**

నంద్యాల పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో పంచాయతీ అధికారులు విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో వైద్య అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రదాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులు మరియు సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్న మండల స్థాయి గ్రామస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడంతో గ్రామాల్లో విష జ్వరాలు ప్రభలుతున్నాయి. గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు పడడంతో గ్రామాల్లో రహదారులు, వీధులలో వర్షపు నీరు ఆగి బురదమయంతో నీటి కాలుష్యం, దోమలు ఏర్పడి విష జ్వరాలకు దగ్గర అవుతున్నారు . గతంలో ఆళ్లగడ్డ మండలం జమ్ములదిన్నె గ్రామ ప్రజలు సీజనల్ వ్యాధులతో చాలా ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో రోజు రోజుకు వాంతులు, విరేచనాలు వంటి అనేక సమస్యలతో జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రిలు కిట కిట లాడుతున్నాయి. గ్రామ అధికారులు మరియు వైద్యాధికారులు అప్రమత్తమై మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స చేస్తూ గ్రామ ప్రజలకు ఆరోగ్యపరమైన సూచనలు ఇస్తూ సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలని పలువురు కోరుతున్నారు. . గ్రామాల్లో ఎక్కువగా కలుషిత నీటి ప్రభావంతో వస్తున్నాయని బోరింగ్ నీరు తో పాటు మినరల్ వాటర్ తాగిన వారికి కూడా సీజనల్ వ్యాధులు వస్తున్నాయని పలువురు అంటున్నారు . మండల అధికారులు ఎమ్మార్వో, ఎంపీడీవో మరియు గ్రామ అధికారులు, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్ గ్రామంలో పర్యవేక్షించి పారిశుద్ధ్య లోపాలను మరియు వాటర్ ట్యాంకు లను శుభ్రం చేయాలని కోరుతున్నారు. గ్రామ ప్రజలు ఎలాంటి భయాందోళన గురి కాకుండా మనోధైర్యాన్ని అధికారులు నింపాలని పలువురు కోరుతున్నారు.



# ఘనంగా టి.జి భరత్ జన్మదిన వేడుకలు





కర్నూలు ఆగష్టు 05 –: కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. టిజి భరత్ అభిమానులు, టిడిపి నేతలు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను నిర్వహించారు. ముందుగా నగరంలోని వెంకటేష్ థియేటర్ ప్రక్కనున్న గోశాలలో టి.జి భరత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు గ్రాసం తినిపించారు. అనంతరం రాజ్‌విహార్‌లోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అభిమానులు ఏర్పాటుచేసిన ప్రత్యేక ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్నారు. మౌర్య ఇన్‌లోని ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన బర్త్ డే వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిజి అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం భరత్ ను భారీ గజ మాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి కర్నూల్లోని టిడిపి కార్పోరేటర్లు, వార్డుల ఇంచార్జీలు, ఆయన అభిమానులు, తదితరులు హాజరయ్యారు.

# కర్నూలు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్

కర్నూలుఆగష్టు 05 –: కర్నూలు ఎంపీ కార్యాలయంలో ఎంపీ యస్ సంజీవ్ కుమార్ ని సీఐడీ కర్నూలు డీఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు లో ఉన్న సీఐడీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ యస్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్ ద్వారా సీఐడీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం కొరకు 25 లక్షల రూపాయలు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన లెటర్ డీఎస్పీ కి ఎంపీ అందజేశారు . ఈ సందర్భంగా ఎంపీ కి డీఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# బిసి కులాలకు రాజకీయ రిజర్వేషన్లు సాదించుకుందాం

## రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తాం



కర్నూలు ఆగష్టు 05 –: కర్నూలు బిసి భవనములో బిసి జెఏసి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దేవపూజ ధనుంజయ్య ఆచారి , బత్తుల లక్ష్మికాంతయ్య , జే. శ్రీనివాసులు నాయుడు అయ్యన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవపూజ ధనుంజయ్య ఆచారి మాట్లాడుతూ ఈనెల 21-08-2022 ఆదివారం కర్నూలు జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో జరిగే బిసి రాజకీయ చైతన్య సదస్సు కు బిసి కులాల నాయకులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని , ప్రతి కులానికి చెందిన వారు అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న నాయకులు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాలని, చదువులు ఏవిధంగా చదువుతామో అదేవిధంగా రాజకీయ చదువులు చదివి రాజకీయ చదరంగం నేర్చుకోవాలన్నారు . ఈ రోజు బిసి కుర్వ సామాజిక వర్గానికి చెందిన హిందూపురం పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాదవ్ కి రాజకీయంగా అనగాతొక్కడానికి ఎన్నో కుట్రలు చేస్తున్నారని, తెలుగుదేశం పార్టీ నాయకుల చానెల్ వారు బిసి కులాల వారు , రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తే తెలుగుదేశం పార్టీలో

నాయకులు గుండెల్లో రైళ్లు పరుగెత్తే విధంగా గుండె చప్పుడు వినిపిస్తోందని అన్నారు . ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ాఅ ాు ఃఅ మైనార్టీ సామాజిక వర్గాలకు రాజకీయ లబ్ధి చేకు?రుస్తున్నారన్నారు. మంత్రి పదవుల్లో సామాజిక న్యాయం చేసారని , నామినేటెడ్ పదవుల్లో బడుగు బలహీన వర్గాలకు చెందిన ాఅ ాు ఃఅ మైనార్టీ నాయకులకు 50%రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని , మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు , కావున బిసి కులాల నాయకులు ప్రతి ఒక్కరూ బిసి రాజకీయ చైతన్య సదస్సు లో పాల్గొని ఈ కార్యక్రమును విజయవంతము చెయ్యవలసినదిగా కోరారు. రాజకీయ చదువులు చదివి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి మనల్ని మనమే శాసించేవిదంగా రాజకీయ రిజర్వేషన్లు సాదించుకుందాం అన్నారు .

# ప్రజాస్వామ్య దేశంలో నియంత పాలన

## మోడీ పెరిగిననిత్యావసం సరుకుల ధరలు తగ్గించండి

## కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు యం సుధాకర్ బాబు



కర్నూలు ఆగష్టు 05 –: ప్రజాస్వామ్య దేశంలో నియంత రాజ్యమేలుతున్నాడని అడ్డుచెప్పిన వారిపై కక్షసాధింపు చర్యలతో అణచివేయాలని చూస్తున్నారని దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యం సుధాకర్ బాబు గారు బిజెపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈరోజు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ గారి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిత్యావసర ధరల పెరుగుదలపై మరియు అగ్నిపత్ పథకానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమము పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా స్థానిక కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ కొండారెడ్డి బురుజు కూడలి నందు ప్రధాని మోదీకి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సుధాకర్ బాబు గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ గారు అధికార బలంతో ధనబలంతో ఆదానీ అంబానీలకు దేశ సంపదను దోచి పెడుతున్నారని ప్రతిదీ ప్రైవేట్పరం చేస్తున్నారని గత ఏడు సంవత్సరాల్లో మోదీగారు శాశ్వతమైన ప్రాజెక్టులు లేదా జాతికి ఉపయోగపడే పనులు ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. అలాగే గత కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్యాస్ సిలిండర్ ధర నాలుగు వందలు ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు పదకొండు వందల యాభై రూపాయలు అయ్యిందని అలాగే పప్పుధాన్యాలు వంట నూనెలు తగ్గించే ధైర్యం మోదీగారికి లేదా అని ప్రశ్నించారు. భారత దేశ యువతకు నష్టం కలిగించే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని లేకుంటే మా ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ గారి నాయకత్వంలో మోడీగారి మెడలు వంచైనా సరే ధరలు తగ్గించే వరకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఆందోళన చేపడుతుందని సుధాకర్ బాబు గారు తెలియ జేశారు. అనంతరం నిరసన తెలియజేస్తున్న డీసీసీ అధ్యక్షులు ఎం సుధాకర్ బాబు గారిని మరియు కాంగ్రెస్ నాయకులను రెండవ పట్టణ పోలీసులు పోలీసు వాహనంలో స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ డిసిసి ప్రధాన కార్యదర్శులు దామోదరం రాధాకృష్ణ, బి క్రాంతి నాయుడు, యస్ బాబురావు పీసీసీ అధికార ప్రతినిధి ఏ కరుణాకర్ బాబు ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు అమరేంద్రరెడ్డి కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గుప్త సౌల్ రాజు ఎస్సీ సెల్ ఎస్ ఈశ్వర్ మైనార్టీ సెల్ ఖాజా హుస్సేన్ ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి ఎం సుంకన్న ఆనందం గోవిందు చిరంజీవి మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల కె వెంకటలక్ష్మి ఆర్ మద్దమ్మ ఎల్లమ్మ మొదలగు మహిళలు పాల్గొన్నారు.

# చెరువుల వద్ద ఆహ్లాదకర వాతావరణాన్ని ఉండేలా సుందరీకరించాలి

## -: కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావ్వు

కర్నూలు ఆగష్టు 05 –: అమృత్సరోవర్ కింద అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా సుందరీకరణ చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఓర్వకల్లు మండలం బ్రాహ్మణ పల్లెలో అమృత్సరోవర్ కింద అభివృద్ధి చేస్తున్న చెరువును పరిశీలించి, అక్కడే చేపడుతున్న మొక్కల పెంపకం కార్యక్రమంలో కలెక్టర్ , డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రూ. 7.93కోట్లతో 88 చెరువులను అభివృద్ధి చేయడం జరుగుతోన్దన్నారు.. బ్రాహ్మణపల్లి చెరువును ఆరు లక్షల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.. చెరువు పరిసర ప్రాంతాల్లో 200 మొక్కలు నాటడం జరుగుతుందన్నారు.. ఊరి ప్రజలు సాయంత్రం కూర్చోవడానికి వీలుగా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అనంతరం కలెక్టర్ మొక్కలు నాటారు..కాల్వబుగ్గ నర్సరీ పరిశీలనఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ వద్ద జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీని కలెక్టర్ పరిశీలించారు.. 25 లక్షల బియ్యంతో నర్సరీని పెంచుతున్నట్లు డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి కలెక్టర్కు వివరించారు.. పెంచిన మొక్కలను రైతులకు పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.. అనంతరం కలెక్టర్ మొక్కలను రైతులకు పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తహసిల్దార్ ఇతర అధికారులు పాల్గొన్నారు..





కర్నూలు నగర కార్పొరేషన్ అధికారులారా... ఇటు చూడండి.... కర్నూలు నగరంలో నిత్యం రద్దీగా ఉండే పళ్ళ మార్కెట్ రోడ్డుకు మధ్యలో యదేచ్ఛగా షెడ్డు వేస్తున్నా , ఈ షెడ్డు ని తొలగించండి అని చెప్పినా, ఇది ప్రజలకు, ట్రాఫిక్, వ్యాపారానికి ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పినా అధికారుల వైఖరిలో ఎటువంటి చలనం లేదని స్థానికులు వాపోతున్నారు. అదే స్థలంలో ఒక పేదోడు చిన్న బండి పెట్టుకున్న తొలగించడానికి ఆగమేఘాల మీద వచ్చే అధికారులకు ఇంత పెద్ద షెడ్డు కనబడలేదా , అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి.

# ప్రభాస్ డైరెక్టర్ భలే చమత్కారించారే!




వెర్సటైల్ యాక్టర్ టాలెంటెడ్ హీరో దుల్కర్ సల్మాన్ నటించిన లేటెస్ట్ రొమాంటిక్ లవ్ స్టోరీ 'సీతా రామం'. హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. 'యుద్ధంతో రాసిన ప్రేమకథ' అని ట్యాగ్ లైన్. పీరియాడిక్ నేపథ్యంలో సాగే ఓ ఫిక్షనల్ ప్రేమకథ. యుద్ధం అందమైన ప్రేమకథ నేపథ్యంలో ఈ మూవీని రూపొందించారు. వైజయంతీ మూవీస్ సమర్పణలో స్వప్న సినిమాస్ బ్యానర్ పై సి. అశ్వనీదత్ ఈ సినిమాని నిర్మించారు. మరి కొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.ఈ సందర్భంగా ఈ మూవీ ప్రమోషన్స్ ని చిత్ర బృందం గత కొన్ని రోజులుగా జోరుగా నిర్వహిస్తోంది. బుధవారం ఈ మూవీకి సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ని భారీ స్థాయిలో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్ లో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పాల్గొని సందడి చేశారు. దుల్కర్న మృణాల్ లపై ప్రశంలసలు కురిపించారు. దేశ వ్యాప్తంగా పేరున్న హీరో దుల్కర్ అని అతని నటన గురించి చాలా మంది చాలా రకాలు గా చెబుతున్నారని ప్రశంసల వర్షం కురిపించారు.ఈ మూవీ నిర్మాతలు ప్రభాస్ తో 'ప్రాజెక్ట్ కె' ని నిర్మిస్తున్నారు. దాదాపు రూ. 500 కోట్ల భారీ బడ్జెట్ తో ఈ మూవీ రూపొందుతోంది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ మూవీని రూపొందిస్తున్నారు. బాలీవుడ్ క్రేజీ స్టార్స్ అమితాబ్ బచ్చన్ దీపికా పదుకోన్ దిషా పటాని కీలక పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే.ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతలగా వ్యవహరించిన సుమ కనకాల దర్శకుడు నాగ్ అశ్విన్ కు 'ప్రాజెక్ట్ కె' రిలీజ్ గురించి అడిగారు.సినిమా రిలీజ్ ఎప్పుడు వుండే అవకాశం వుందని ప్రశ్నించడంతో నాగ్ అశ్విన్ తనదైన చమత్కారంతో సమాధానం ఇవ్వడం ఇప్పుడు వైరల్ గా మారింది. నాలుగు గ్రహాలు కలిసి గ్రహణం ఏర్పడినప్పుడు సినిమా విడుదలవుతుంది అంటూ చమత్కరించారు. దీంతో ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఈ సందర్భంగా మాట్లాడిన దుల్కర్ 'ప్రాజెక్ట్ కె'పై వున్న క్రేజ్ ని మరింతగా పెంచే ప్రయత్నం చేశాడు.ప్రాజెక్ట్ కె భారతీయ సినిమాని సమూలంగా మార్చబోతోంది. నాగి ఎలా ఆలోచిస్తాడో ఎవరైనా ఆలోచించగలరో నాకు తెలియదు కానీ ప్రాజెక్ట్ కె అద్భుతంగా వుంటుంది' అంటూ దుల్కర్ సల్మాన్ వెల్లడించడం విశేషం.

# సాంబార్ బ్రదర్స్ పక్కా ట్రెడీషనల్ గురూ

తమిళ్ మెగా బ్రదర్స్ గా పేరు దక్కించుకున్న సూర్య మరియు కార్తి లు కలిసి స్క్రీన్ షేర్ చేసుకునేది ఎప్పుడో కాని వారిద్దరు కలిసి స్టేజ్ షేర్ చేసుకున్నా కూడా అభిమానులకు కన్నుల పండుగ అన్నట్లుగా ఉంటుంది.మన మెగా బ్రదర్స్ చిరంజీవి మరియు పవన్ కళ్యాణ్ ఒకే స్టేజీ మీద కనిపిస్తే ఎలా ఉంటుందో తమిళ్ ప్రేక్షకుల్లో కూడా సూర్య.. కార్తి కనిపిస్తే అలాగే ఉంటుంది.ఈ తమిళ్ సాంబార్ బ్రదర్స్ తాజాగా విరుమాన్ సినిమా యొక్క ఆడియో వేడుకలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా వారిద్దరు కూడా తమిళ్ సాంప్రదాయ డ్రెస్ అయిన ప్లెయిన్ షర్ట్ మరియు వైట్ లుంగీ లో కనిపించారు. ఈ బ్రదర్స్ ఇద్దరిని కూడా ట్రెడీషనల్ లుక్ లో కూడా అభిమానులతో పాటు మీడియా వారు అలా చూస్తూనే ఉండి పోయారు అన్నట్లుగా స్టిల్స్ ఉన్నాయి.కార్తి నటించిన విరుమాన్ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సూర్య పాల్గొన్నాడు. ఆ సమయంలో సూర్య అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సూర్య ను ఆహ్వానించారు. ఆ తర్వాత రోలెక్స్... రోలెక్స్ అంటూ గట్టి గట్టిగా అరుస్తూ సూర్య పై తమ అభిమానం ను చాటుకున్నారు.ఇక సూర్య ఈ ఆడియో విడుదల కార్యక్రమంలో మాట్లాడుతూ నా కంటే కూడా కార్తి బెస్ట్ యాక్టర్ అన్నట్లుగా వ్యాఖ్యలు చేశాడు. కార్తి యాక్టింగ్ అంటే తనకు ఇష్టం అని.. తమ్ముడు కార్తికి ఈ సినిమా సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను అన్నట్లుగా వ్యాఖ్యలు చేశాడు.ఈ సాంబార్ బ్రదర్స్ ఒకరిపై ఒకరు ప్రశంసలు చేసుకున్నారు. వీరు ఇద్దరు కూడా తెలుగులో కూడా మంచి పాపులారిటీని దక్కించుకున్న విషయం తెల్సిందే.



# మేజర్ సర్జరీ.. లాంగ్ జంప్ చేయొద్దన్నారు; ఎవరీ మురళీ శ్రీశంకర్



ఒక ఇంట్లో తండ్రి మంచి క్రీడాకారుడైనంత మాత్రాన అతడి వారసులు(కొడుకు లేదా కూతురు) అలాగే అవ్వాలని ఎక్కడా రాసిపెట్టి ఉండదు. అయితే, కొంతమంది తల్లిదండ్రులు మాత్రం తమ వారసులు కూడా క్రీడాకారులు అవ్వాలని.. రాణించాలని ఆశపడుతుంటారు. మరికొంత మంది మాత్రం తాము ఏం కావాలనుకుంటున్నామో అన్న నిర్ణయాన్ని పిల్లలకే వదిలేస్తారు. ఆ ప్రయత్నంలో కొంతమంది పిల్లలు విఫలమైతే.. మరికొందరు మాత్రం వారసత్వాన్ని కొనసాగిస్తూ దూసుకుపోతారు. ఆ కోవకు చెందినవాడే భారత్ హై జంప్ స్టార్ అథ్లెట్ మురళీ శ్రీశంకర్. తన అపూర్వ విజయంతో తల్లిదండ్రులతో పాటు యావత్ భారతావనిని గర్వపడేలా చేశాడు.బర్మింగ్‌హమ్ వేదికగా జరుగుతున్న కామన్‌వెల్త్ గేమ్స్ 2022లో హై జంప్ విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో ఐదో ప్రయత్నంలో 8.08 మీటర్లు దూకి రజతం ఒడిసిపట్టాడు. ఇక శ్రీశంకర్ ఆర్థికంగా ఏనాడు ఇబ్బంది పడనప్పటికి.. ఈరోజు పతకం సాధించాడంటే అందులో తన పాత్ర ఎంత ఎందో.. కుటుంబానికి అంతే ప్రాధాన్యత ఉంటుంది. 23 ఏళ్ల మురళీ శ్రీ శంకర్ కేరళలోని పాలక్కడ్ ప్రాంతంలో పుట్టి పెరిగాడు. తల్లిదండ్రులిద్దరు క్రీడాకారులే కావడం శ్రీశంకర్‌కు కలిసి వచ్చింది. తల్లి కెఎస్ బిజ్మోల్ 800 మీటర్ల క్రీడాకారిణి.. తండ్రి ఎకోస్ బిజ్మోల్ అథ్లెటిక్స్ కోచ్‌గా పని చేస్తున్నాడు. ఇంకేముంది తల్లిదండ్రులిద్దరు క్రీడా విభాగంతో పరిచయం ఉంటే శ్రీశంకర్ క్రీడాకారుడు కాకుండా ఇంకేం అవుతాడు.2018 కామన్‌వెల్త్ క్రీడలకు చివరి నిమిషంలో దూరమయ్యాడు మురళీ శ్రీశంకర్. అపెండిస్ రూపంలో అతనికి సమస్య వచ్చి పడింది. నొప్పిని భరించలేక కామన్‌వెల్త్ గేమ్స్‌కు దూరమయ్యాడు. లాంగ్ జంప్ చేస్తే సమస్యలు చుట్టుముడుతాయన్నారు వైద్యులు. కానీ అపెండిస్ ఆపరేషన్ విజయవంతం కావడం.. ఆ తర్వాత కఠోర సాధన ద్వారా శ్రీశంకర్ లాంగ్‌జంప్‌లో ఈ నాలుగేళ్లలో తనను తాను చాలా మెరుగు పరుచుకున్నాడు. తాజాగా కామన్‌వెల్త్ గేమ్స్‌లో రజతంతో మెరిసిన మురళీ శ్రీశంకర్ ఔరా అనిపించాడు. ?శ్రీశంకర్ తాను సాధన చేసే సమయంలో ఎలాంటి డిస్టర్బన్స్ లేకుండా చూసుకోవడం అలవాటు. తాను ఇంట్లో ప్రాక్టీస్ చేస్తున్న సమయంలోనూ అంతేనంట. ఒక సందర్భంలో శ్రీశంకర్ తండ్రి మొబైల్‌కు హెడ్‌ఫోన్స్ పెట్టుకొని పాటలు వింటున్నాడు. ఆ పాట సౌండ్ శంకర్‌కు వినిపించింది. వెంటనే తండ్రి దగ్గరకు వచ్చి నా ప్రాక్టీస్ సమయంలో నాకు ఎలాంటి సౌండ్ వినిపించొద్దు.. అలా అయితే నేను డిస్టర్బ్ అవుతా అని చెప్పాడట. అంతే అప్పటి నుంచి ఇప్పటివరకు శ్రీశంకర్ ప్రాక్టీస్ సమయంలో తండ్రి మ్యూజిక్‌ను బ్యాన్ చేస్తూనే వచ్చాడు. శ్రీశంకర్ తెచ్చిన ఈ రూల్ ఇప్పటికి ఆ కుటుంబసభ్యులు పాటిస్తూనే ఉన్నారు.?ఇక రాత్రి 11 గంటల తర్వాత శ్రీశంకర్ ఇంట్లో ఎవరు టీవీ చూడరు. అది ఎంత పెద్ద మ్యాచ్ గాని.. ఇంట్లో మాత్రం టీవీ ఆన్ చేయరు. తాజాగా శ్రీశంకర్ ఒక మెగాటోర్నమెంట్‌లో పాల్గొంటూ మ్యాచ్ ఆడుతున్న సంగతి తెలిసి కూడా టీవీ పెట్టలేదంటే వాళ్లు తమ నిర్ణయానికి ఎంత కట్టుబడి ఉన్నారో తెలుస్తోంది. తమ కొడుకు కామన్‌వెల్త్‌లో రజతం సాధించాడన్న వార్తను ఆ తల్లిదండ్రులు ఉదయమే తెలుసుకోవడం విశేషం.?శ్రీశంకర్ తనకు 18 ఏళ్ల వయసు వచ్చేవరకు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటికి దూరంగా ఉన్నాడు. తల్లిదండ్రులు తనపై ఎన్ని ఆంక్షలు పెట్టినా వాటిని ఏనాడు నెగిటివ్‌గా తీసుకోలేదు. వాళ్లు పెట్టే కండీషన్స్ వల్లే ఈరోజు ఈ స్థాయికి చేరుకున్నానని శ్రీశంకర్ బలంగా నమ్ముతాడు.?సాధారణంగా క్రీడాకారులుగా మారేవాళ్లకు సరిగ్గా చదువు అబ్బదంటారు. కానీ ఈ విషయంలో శ్రీశంకర్ పూర్తిగా వేరు. ఆటలో ఎంత చురుకుగా ఉండేవాడో.. చదువులోనూ అంతే చురుకుదనాన్ని చూపించేవాడు. మ్యాచ్‌లు లేని సమయంలో చదువుకునే శ్రీశంకర్.. ఒకవేళ తాను పాల్గొనబోయే గేమ్స్‌లో సమయం దొరికితే కూడా చదువుకునేవాడు. అలా 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లు 95 శాతం మార్కులతో పాసయ్యాడు.?ఆ తర్వాత నీట్ పరీక్షలో స్పోర్ట్స్ కోటాలో సెకండ్ ర్యాంక్ సాధించిన మురళీ శ్రీశంకర్ మెరిట్‌లో బీఎస్సీ మాథ్స్‌ను పూర్తి చేశాడు. నీట్‌లో తనకొచ్చిన మార్కులతో మెడికల్ సీట్ వచ్చే అవకాశం ఉన్నప్పటికి వేరే కారణాల వల్ల మెడిసిన్ చేయలేదు. ఇక్కడ విచిత్రమేంటంటే.. మెరిట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికి శ్రీశంకర్ ఇప్పటికి నిరుద్యోగే.'' చదువు మనకు బ్రతికే తెలివిని నేర్పిస్తుంది.. నాతో సహా నా మిత్రులందరూ ఇప్పటికీ ఏ ఉద్యోగాలు చేయడం లేదంటే నమ్ముతారా.. భారత్ కదా ఈ పరిస్థితి మామూలే'' అని ఒక సందర్భంలో చెప్పుకొచ్చాడు.శ్రీశంకర్ ఇచ్చే పార్టీల్లో ఫ్రూట్ జ్యూస్‌లు తప్ప ఇంకేం కనిపించవు. ఎందుకంటే శ్రీశంకర్ ఆల్కహాల్‌ను ఎంకరేజ్ చెయ్యడు. తన మిత్రుల్లో చాలా మంది మందు, సిగరెట్లు అలవాట్లు ఉన్నవారే. కానీ శ్రీశంకర్ పార్టీలిచ్చినా.. ఏ పార్టీలకు వెళ్లినా అక్కడ నో ఆల్కాహాల్.. నో సిగరెట్. ఎందుకంటే శ్రీశంకర్‌కు మేమిచ్చే గౌరవమని అతని స్నేహితులు పేర్కొంటారు.శంకు(మురళీ శ్రీశంకర్ ముద్దుపేరు) నా కొడుకుగా పుట్టడం అదృష్టంగా భావిస్తున్నాం. ఎంత పెద్ద స్థాయికి చేరుకున్నా వాడు చూపించే ప్రేమ, గౌరవం ఎప్పుడు తగ్గిపోలేదు. స్కూల్ వయసు నుంచి వాడిని ఒక మంచి అథ్లెట్‌గా చూడాలని కఠిన నిబంధనల మధ్య పెంచినా.. ఒక్కసారి కూడా మాకు ఎదురుచెప్పడం చూడలేదు. అందుకే ఈరోజు దేశం గర్వించే స్థాయికి చేరుకున్నాడు'' వాడు(శ్రీశంకర్) కష్టపడే తత్వాన్ని ఎప్పుడు వదల్లేదు. ఏనాడు షార్ట్‌కట్స్, అడ్డదారులు తొక్కలేదు. చిన్నప్పటి నుంచి కష్టపడిన తత్వమే ఈరోజు ఈస్థాయిలో నిలబెట్టింది. ఒక తండ్రిగా నాకు ఇంతకమించి ఏముంటుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**